క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ



పొన్నూరు: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మునిపల్లె గ్రామంలో రాజకీయ కక్షతో దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుంటుపల్లి అంజయ్యను ఆయన పరామర్శించి అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

తహసీల్దార్ జియావుల్‌హక్



పొన్నూరు: వివిధ సమస్యలపై మండల ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ జియావుల్‌హక్ అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. భూమి సర్వే కోసం స్వీకరించిన 2 అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ హుస్సేన్, ఎంపీఏ డేగల వెంకట్రామయ్య, సీడీపీఓ వెంకట రమణ, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



గుంటూరు రూరల్: రబీ పంటల్లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతు అవగాహన సదస్సును బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. నిడుముక్కల గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామంలోని రైతులతో కలిసి వ్యవసాయ సమస్యలు వాటి పరిష్కారాలపై చర్చించారు. రబీ పంట కాలంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, అపరాల సాగులో వచ్చే చీడపీడలు, వాటి నిర్మూలనకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు గ్రామ ప్రజలు, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

21న వినియోగదారుల దినోత్సవంపై పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈనెల 21న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు–డిజిటల్ సౌలభ్యం' అనే అంశంపై గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్ల, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల రూపంలో వరసగా రూ.మూడు వేలు, రూ.రెండు వేలు, రూ.1,500 చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. ఎస్‌ఏ-1 పరీక్షల కారణంగా గతంలో ఇచ్చిన షెడ్యూల్ కాకుండా ఈనెల 21న ఉదయం 10 గంటలకు అన్ని యాజమాన్యాల్లోని చదువుతూ, పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులను పంపాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: భర్త వేధింపులతో ఈనెల 8వ తేదీన ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కొబాల్డ్‌పేట 3వ లైన్‌కు చెందిన ఆరేపల్లి మాధవి(26) తల్లి దండ్రులు మృతి చెందినప్పటి నుంచి అమ్మమ్మ మరియమ్మ వద్దనే ఉంటుంది. 2013లో ఆరేపల్లి ఈశ్వరబాబుతో పెద్దలు కుదిర్చిన వివాహం జరిగింది. వీరువురికి ఇద్దరు మగ సంతానం ఉన్నారు. భర్త చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆరేపల్లి మాధవిని నిత్యం మద్యం తాగి వేధిస్తూ నివాస గృహంలో ఉన్న వస్తువులు కూడా అమ్ముకున్నాడు. దీంతో మాధవి భర్త వేధింపులు భరించలేక ఈనెల 8వ తేదీన పట్టాభిపురంలోని ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీంతో స్థానికులు గమనించి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మాధవి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో పోలీసులకు సమాచారం రావడంతో మృతురాలి వివరాలు సేకరించారు. మృతురాలి సోదరి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త ఆరేపల్లి ఈశ్వరబాబుపై కేసు నమోదు చేశారు.

దొంగలు.. బాబోయ్.. దొంగలు

శివారు ప్రాంతాలు.. హైవే లక్ష్యంగా చోరీలు, దారి దోపిడీలు

- మద్యం మత్తులో ఆకతాయిల అరాచకాలు
- ఒంటరిగా ప్రయాణాలు చేసేవారే లక్ష్యంగా దాడులు
- నిలిపి ఉన్న లారీ డ్రైవర్లపైనా దాడి, నగదు దోపిడీలు
- రాత్రి పోలీసు గస్తీలు లేకపోవటమే కారణమంటున్న ప్రజలు





గుంటూరు రూరల్: మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలైన యువత డబ్బు కోసం ఎంతటి అఘాయిత్యానికైనా ఒడిగడుతున్నారు. రాత్రి సమయాల్లో చోరీలు, దారి దోపిడీలు, ఒంటరిగా ప్రయాణాలు చేసే వారిపై దాడులు చేసి వారిని గాయపరిచి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇదంతా ఒకెత్తయితే నగర శివారుల్లోని హైవే రోడ్డుపై రాత్రి సమయాల్లో లారీలను నిలిపి సేద తీరుతున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లను సైతం బెదిరించి, దాడి చేసి గాయపరిచి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇదంతా రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్, గస్తీలు, బీట్‌లు సక్రమంగా లేకపోవటంతోనే ఆకతాయిల అరాచకాలు పెరిగిపోతున్నాయని నగర శివారు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.

- గత ఐదు నెలల క్రితం చుట్టుగుంట సమీపంలో లాలుపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను ఆటో, ద్విచక్ర వాహనంపై వచ్చిన నలుగురు వ్యక్తులు దాడిచేసి వారి వద్ద సెల్‌ఫోన్, నగదు దోచుకున్నారు. ఈ ఘటనలో దాడి చేసిన దుండగులు సైతం పారిపోయే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి గాయపడ్డారు. దాడిలో గాయపడిన వ్యక్తులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వెళ్లగా దుండగులు దాడిలో ఉపయోగించిన ద్విచక్ర వాహనం జీజీహెచ్ వద్ద కనిపించటంతో నల్లపాడు పోలీసులు రెక్కీ నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
- రెండు నెలల క్రితం రూరల్ మండలం పరిధిలోని అంకిరెడ్డిపాలెం వద్ద తెల్లవారుజామున బంధువులను బస్సు ఎక్కించేందుకు వచ్చిన ఇరువురిని ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి దాడి చేసి గాయపరిచిన ఘటన జరిగింది. వారి వద్ద నుంచి డబ్బులను లాక్కుని కేకలు వేస్తే చంపుతామని బెదిరించారని సమాచారం. అక్కడి నుంచి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీ డ్రైవర్‌ను సైతం బెదిరించి అతని వద్ద నగదును దోచుకెళ్లారు. బాధితులు మాత్రం జీజీహెచ్‌కు చికిత్స చేయించుకుని వెళ్లారు.
- గత నెలలో రూరల్ మండలం పొత్తూరు వద్ద ఆటోలో నలుగురు వ్యక్తులు, ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇరువురు వ్యక్తులను అడ్డగించి వారిపై దాడి చేసి గాయపరిచి సెల్‌ఫోన్‌లు, నగదు దోచుకెళ్లారు.
- నెల క్రితం వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడుకు చెందిన ఇరువురు రైతులు రాత్రి సమయంలో ఇంటికి వెళుతుండగా లాలుపురం వద్ద ఇద్దరు వ్యక్తులు వారిపై దాడి చేసి నగదు దోచుకుని పారిపోయారు.
- పది రోజుల క్రితం అంకిరెడ్డిపాలెం బైపాస్ రోడ్డు నుంచి వట్టిచెరుకూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులను పొత్తూరు సమీపంలో రాత్రి సమయంలో బెదిరించి వారి వద్ద నుంచి నగదు, నగలు దోచుకెళ్లారు. ఇన్ని అరాచకాలు జరుగుతున్నా బాధితుల్లో కొందరు మాత్రమే పోలీసుల దృష్టికి తీసుకెళుతున్నారు. ఇలా నిత్యం నగర శివారుల్లో దాడులు, చోరీలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రి సమయాల్లో బీట్ పోలీసులు సైతం సక్రమంగా విధులు నిర్వహించటం లేదని ఆరోపణలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో గస్తీలను పెంచి నగర శివారు ప్రాంతాల ప్రజలను ఆకతాయిలు, దారి దోపిడీ దొంగల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా లేని ప్రాంతాల ఎంపిక

హైవేలు, ప్రధాన రోడ్లపై ఎవ్వరూ దొరక్కపోతే గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లలో సైతం చోరీలకు పాల్పడి గ్రామీణ ప్రజలను సైతం దుండగులు బెంబేలెత్తిస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘా కొరవడటంతో ఇటువంటి నేరాలు జరుగుతున్నాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొందరు దుండగులైతే సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను ఎంచుకుని మరీ రోజువారీ దాడులు, అక్రమాలకు పాల్పడుతున్నారని సమాచారం.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పొన్నూరు: పట్టణంలోని పలు పాఠశాలల్లో ఈ నెల 17 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17, 18, 19, 20 తేదీలలో నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్, కొండముది రోడ్ జెడ్పీ హైస్కూల్, ఏపీ హైస్కూల్, 26, 27, 28 తేదీలలో వివేకా స్కూల్, కొండముది జెడ్పీ హైస్కూళ్లలో నిర్వహిస్తున్న శిబిరాల్లో ఆధార్ సేవలు పొందాలని ఆయన పేర్కొన్నారు.

ఇంటింటికీ రామాయణం పుస్తకాలు పంపిణీ

నగరంపాలెం: రామాయణం గ్రంథం ప్రచారంలో భాగంగా సోమవారం శ్రీనివాసరావుతోట, నల్లచెరువు, ఆర్.అగ్రహారం, సంపత్‌నగర్‌లోని ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈనెల 17న ఆర్ అగ్రహారం రామానామక్షేత్రం ఆవరణలో నిర్వహించనున్న 98వ శ్రీరామకోటి ఉత్సవాల్లో భాగంగా భారతీయ మార్గం పూర్వ ప్రధాన సంపాదకులు, డాక్టర్ పులిచెర్ల సాంబశివరావు రచించిన శ్రీరామాయణం పుస్తకాలను భక్తుల సౌకర్యార్థం దుకాణాల్లో అందుబాటులో ఉంచామని బీజేపీ ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ కావేరి మధు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, కొక్కెర శ్రీనివాస్‌యాదవ్, పులిచెర్ల దేవకాంత్, భారతి, కపిలవాయి బదరీ నారాయణ, సాయిరాధాకృష్ణ, కోనేటి గోవింద్ పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, శిక్షణ రాష్ట్ర పర్యవేక్షకులు వెంకట్రావు



శిక్షణకు హాజరైన అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది

చేబ్రోలు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల కోసం ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన ఆర్థిక ప్రణాళికతో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేసినప్పుడే సాధ్యమవుతుందని బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, శిక్షణ రాష్ట్ర పర్యవేక్షకులు వెంకట్రావు అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, శిక్షణ రాష్ట్ర పర్యవేక్షకులు వెంకట్రావు మాట్లాడుతూ గ్రామాల్లో శానిటేషన్, స్వచ్ఛమైన తాగునీరు, సమతుల ఆహారంతో పాటు గాలి, నేల కలుషితం కాని అభివృద్ధి ప్రణాళికలతోనే సుస్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ శిక్షణ ద్వారా అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సుస్థిరాభివృద్ధి కోసం 9 అంశాలతో గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన 2030 నాటికి సుస్థిరాభివృద్ధి, స్థానికీకరణ దిశగా ప్రణాళికలు ఉండాలని సూచించారు. చేబ్రోలు ఎంపీడీవో కె.లలిత మాట్లాడుతూ ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ రోడ్లు ఇతర నిర్మాణాలు, గ్రామీణ నీటి సరఫరా, విద్య, ఉపాధి హామీ పథకం, వెలుగు, ఐసీడీఎస్, ఆరు ప్రభుత్వ విభాగాల సంబంధిత శాఖల ఉద్యోగులకు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా రిసోర్స్ పర్సన్ అనురాధ, ఈవోపీఆర్డీ ఉషారాణి, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం తిరుప్పావై పై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం గోదా అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ రకాల ఫలరసాలతో, పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కె.వి.రంగనాయకి తిరుప్పావై పై ప్రవచనం చేశారు. ధనుర్మాస విశిష్టత, కాత్యాయిని వ్రతం విశిష్టత, గోదాదేవి అమ్మవారి ఆవిర్భావం తదితర వాటిపై వివరించారు.

మహిళపై పెట్రోల్ పోసిన ఘటనపై కేసు

లక్ష్మీపురం: ఓ మహిళ ఆర్థిక అవసరాలకు డబ్బు అప్పుగా ఇచ్చి తిరిగి అడిగేందుకు ఇంటికి వెళ్లడంతో ఆమెపై పెట్రోల్ పోసి నిప్పు అంటించి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఎన్.టి.ఆర్. కాలనీకి చెందిన జరుపల ప్రమీల అనే మహిళ ముత్యాలరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మికి లక్ష రూపాయలు ఆర్థిక అవసరాలకు అప్పుగా ఇచ్చింది. చాలా కాలంగా అదిగో ఇదిగో అంటున్న క్రమంలో ప్రమీల సోమవారం ముత్యాలరెడ్డి నగర్‌లో ఉంటున్న లక్ష్మి ఇంటి వద్దకు వెళ్ళి డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరింది. దీంతో లక్ష్మి, ఆమెతో పాటు ఉన్న నాగేశ్వరరావుతో కలసి మా ఇంటికి వచ్చి డబ్బులు అడుగుతావా అని ప్రమీలపై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి మంటలను అదుపు చేసి ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు.

సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

లక్ష్మీపురం: పలు కేసుల్లో నిందితుడిగా ఉంటూ అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న వ్యక్తితో పాటు మరొకరు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు అదుపులో తీసుకుని కేసు నమోదు చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ చిలకా రాజకుమార్, డొంకరోడ్డు ప్రాంతానికి చెందిన కొత్తపు రత్నంరాజు అనే వారు ఆ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు అరండల్‌పేట పోలీసులకు సమాచారం వచ్చింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిద్దరిని అదుపులో తీసుకుని వీరి వద్ద ఉన్న 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

చిత్రలేఖనంలో సత్తా చాటిన బాలలు



జాతీయస్థాయి చిత్రలేఖన పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులతో చంద్రశేఖర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గుజరాత్‌కు చెందిన రెయిన్‌బో ఆర్ట్స్ అకాడమీ గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో సుమేధ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనంలో నైపుణ్యవంతులుగా నిలిచిన తమ విద్యార్థులు అత్యధికంగా 31 బంగారు పతకాలతో పాటు 34 రజత, ఎనిమిది కాంస్య, ఏడు ఉత్తమ ప్రతిభా పతకాలతో మొత్తం 80 పతకాలను కైవసం చేసుకున్నారని వివరించారు. అత్యధిక స్థాయిలో పతకాలు సాధించడంతో పాటు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డిని కళారత్న అవార్డుతో సత్కరించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తికి పరామర్శ



పెదకాకాని: గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెరుమాళ్ళ దాసును సోమవారం పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. వారం రోజుల క్రితం రోడ్డు పక్కనే ఆరబెట్టిన ధాన్యం వద్ద పడుకునేందుకు వెళ్లిన దాసు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. మండలంలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రం మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్ కుమార్ తండ్రి దాసు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న దాసును పరామర్శించి అనిల్‌కుమార్‌తో మాట్లాడారు. దాసును పరామర్శించిన వారిలో పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

పచ్చదనం.. పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఎంపీపీ పద్మలీల



పొన్నూరు: మండలంలోని గ్రామాల్లో పచ్చదనం.. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ భవనం పద్మలీల అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణ ఆవశ్యకతపై మండల స్థాయి శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆరోగ్యం, సమృద్ధిగా నీరు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, విస్తరణాధికారి కేవీఎస్ మల్లికార్జునరావు, ఏఓ డి.డి.వి.నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు, సీడీపీఓ వెంకటరమణ, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ఓ వేణు, కార్యదర్శులు పాల్గొన్నారు.

హైవేపై కారు దగ్ధం

గుంటూరు రూరల్: ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి విజయవాడ వెళ్తున్న కారు ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం వద్ద సోమవారం అర్ధరాత్రి ఉన్నట్టుండి కారు నుంచి మంటలు రావడంతో అగ్నికి ఆహుతి అయ్యింది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడం గమనించిన కారులోని డ్రైవర్, మరో వ్యక్తి ఇరువురు బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు అదుపుచేసింది. కారు ఎందుకు తగలబడింది తదితర విషయాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

విద్యుత్ శాఖ ఏడీఈ శ్యామ్‌కుమార్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో విద్యుత్ శాఖ అధికారులు, ఎంఈఓ కెనడీ

కాకుమాను: విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని పొన్నూరు విద్యుత్ శాఖ ఏడీఈ జి.శ్యామ్‌కుమార్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా స్థానిక నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం ఇంధన పొదుపు ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకునే విధంగానే విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకుని విద్యుత్ చార్జీలను తగ్గించుకోవాలని ఆయన సూచించారు. అవసరం మేరకు మాత్రమే విద్యుత్‌ను ఉపయోగించే విధంగా విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ, హెచ్‌ఎం బి.సత్యం, విద్యుత్ శాఖ ఏఈ పఠాన్ మౌలాలి ఖాన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెలగని దీపం.. చీకట్లో ప్రయాణం

అధ్వానంగా వీధి దీపాల నిర్వహణ



నిడుబ్రోలు వంతెనపై వెలగని వీధి దీపం



నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్ వద్ద...



చీకట్లో వంతెనపై గుంతల రోడ్డులో ప్రయాణం

పొన్నూరు: పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు, వార్డుల్లోని వీధుల్లో వీధి దీపాలు వెలగకున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లకు పగుళ్లిచ్చి అధ్వానంగా ఉండటం.. దీనికి తోడు రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై పట్టణ వాసులు ఫిర్యాదులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమే.

- పట్టణ పరిధిలో సుమారు 7 వేల వీధి దీపాలు ఉన్నాయి. వీటి నిర్వహణ, మరమ్మతులు తదితరాలకు మున్సిపల్ సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారు. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో క్షేత్ర స్థాయిలో సమస్యలు ఎదురవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రధాన రోడ్లతో పాటు, డీవీసీ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, సంజీవ్‌నగర్, రవి కాలనీ, బాపట్ల రోడ్డు, ఆలూరు రోడ్డు తదితర ప్రాంతాల్లోని కొన్ని వీధుల్లో చిమ్మ చీకట్లు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- నిడుబ్రోలు వంతెనపై అసలే గుంతల రోడ్డు, ఆపై వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రయాణాలకు ఆటంకంగా మారింది. రేపల్లెకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం అధిక సంఖ్యలో వాహన రాకపోకలు సాగుతుంటాయి. వీధి దీపాలు వెలగక చీకట్లోనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. గుంతల రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. వాహనదారులు ప్రమాదాలు జరిగి గాయాలబారిన పడిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. నెలల తరబడి వీధి దీపాలు వెలగకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వీధి దీపాలకు వెలిగేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు ప్రణాళికాబద్ధంగా నిర్మించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో నూతన రోడ్లను డ్రెయిన్ టు డ్రెయిన్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, డ్రెయిన్ కల్వర్ట్‌పై తప్పనిసరిగా మ్యాన్ హోల్ ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్, విజయపురి కాలనీ, నవభారత్ నగర్, వికాస్ నగర్, ఎల్‌ఆర్ కాలనీ, వాసవీ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లా డుతూ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం అనంతరం డెబ్రిస్‌ని తొలగించాలని, సచివాలయాల వారిగా ఎక్కడైనా రోడ్లు ప్యాచ్ వర్క్ చేయాలని గుర్తిస్తే ఎప్పటికప్పుడు చేపట్టాలని ఎమినిటి కార్యదర్శులను ఆదేశించారు. అన్నమయ్య చెరువులో రిటైనింగ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ వెంబడి ఔషధ మొక్కలను నాటించాలని సూచించారు. నవభారత్ నగర్ 2వ లైన్ పరిశీలించి పారిశుద్ధ్య పనులను క్రమ పద్ధతిలో చేయాలని, ఉదయం ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం డ్రెయిన్ల శుభ్రం, అవసరమైన ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ చేపట్టడం ద్వారా మెరుగైన పారిశుద్ధ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఎస్‌ఎస్ సోమశేఖర్, ఏఈలు చైతన్య, రవి కిరణ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ఏసీ కళాశాల విద్యార్థులకు పతకాలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూలో ఈనెల 13,14,15వ తేదీల్లో నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ మీట్‌లో ఏసీ కళాశాల క్రీడాకారుల బృందం పతకాలు కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ తెలిపారు. సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మోజెస్ మాట్లాడుతూ బీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి సీహెచ్ ఆదినారాయణ డెకాథ్లాన్, లాంగ్ జంప్, బీఏ తృతీయ సంవత్సర విద్యార్థి ఎ.ప్రేమ్‌చంద్ వెయ్యి మీటర్లు, ఐదు వేల మీటర్ల పరుగులో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఎంఏ ఇంగ్లీష్ ప్రథమ సంవత్సర విద్యార్థి భాను 400 మీటర్ల పరుగు, బీఏ తృతీయ సంవత్సర విద్యార్థి పి.నాని 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు పొందారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మోజెస్‌తో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ జీఏ ప్రీతమ్ ప్రకాష్ అభినందించారు.